

నేడు శ్రీకూర్మనాథుని కల్యాణోత్సవం

గార, మే 18: వైశాఖ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీకూర్మంలోని కూర్మనాథుని కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు ఇతర అర్చక స్వాములు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామికి నిత్యపూజలు చేస్తారు. రాత్రికి అశ్వ, గజ, శేష వాహనాల్లో స్వామి ఉత్సవ మూర్తులను మేళతాళాలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో గురునాథరావు తెలిపారు.

కూటమిపైనే ఆశలు



● గత నెల 24న సీఎం జగన్ టెక్కలిలో సిద్ధం సభ నిర్వహించారు. ఈ సభకు వజ్రపుకొత్తూరు మండలం బెండిసీతాపురం నుంచి జనాన్ని తీసుకువచ్చిన వాల్తేరు డిపో బస్సు అప్రోచ్‌రోడ్డు డివైడర్ ఎక్కి ఇరుక్కుపోయింది. దీంతో బస్సులో ఉన్న జనం ఉలిక్కిపడ్డారు. నెమ్మదిగా ఆగిన బస్సు నుంచి కిందకు దిగి ఊపిరి పీల్చుకున్నారు.



● ఈ నెల 7న ఇచ్ఛాపురంలో సీఎం జగన్ రోడ్‌షో నిర్వహించారు. రోడ్‌షో ప్రారంభం కాకముందే.. ఉదయం 10గంటల నుంచే ఆర్టీసీ బస్సులను ఇచ్ఛాపురం కాంప్లెక్స్‌లో నిలిపేశారు. సోంపేట, ఒడిశా నుంచి వచ్చిన బస్సులు కూడా టౌన్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. సోంపేట నుంచి వచ్చే బస్సులను హైవే మీదుగా తరలించడంతో.. ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద దిగి కాలినడకన ఇళ్లకు చేరుకున్నారు.



● గత నెల 24న టెక్కలిలో సీఎం సభకు ఆర్టీసీ బస్సులన్నీ తరలించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పలాస-కాశీబుగ్గ కాంప్లెక్స్‌లో గురువారం వేకువ జామున 4.30 గంటల నుంచి బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించగా.. ఏడు గంటలైనా రాలేదు. దీంతో ఒడిశా ఆర్టీసీ, ప్రైవేటు బస్సులను ఆశ్రయించారు.

- ఐదేళ్లుగా ఆర్టీసీ చార్జీల బాదుడు
- విసుగెత్తిపోయిన ప్రయాణికులు
- బస్సులను పార్టీ కార్యక్రమాలకు వాడుకున్న వైసీపీ
- ఆ సమయంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు
- అయినా తీరు మార్చుకోని అధికార పార్టీ
- చార్జీలు పెంచినా మెరుగైన సేవల్లో వైఫల్యం
- ఎన్నికల్లో ఈ ప్రభావం ఉంటుందని అనుమానం
- బెంబేలెత్తిపోతున్న వైసీపీ నాయకులు

(రణస్థలం)

ఆర్టీసీలో ప్రయాణం.. సురక్షితం అన్నది ఒకప్పటి మాట. జగన్ సర్కారు హయాంలో మాత్రం ఆర్టీసీ అంటేనే ప్రమాదకరం, ఆర్థికభారంగా మారిపోయింది. గత ఐదేళ్లు ఆర్టీసీ.. వైసీపీ సొంత సంస్థగా వ్యవహరించింది. సీఎం జగన్ జిల్లాల పర్యటనకు వస్తే చాలు.. ఆయా రీజియన్ పరిధిలో ఆర్టీసీ ప్రజారవాణ నిలిచిపోవాల్సిందే. చివరకు 500 కిలోమీటర్ల దూరంలో సమావేశాలు జరిగినా ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను ఇష్టారాజ్యంగా వాడేశారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలోనూ దాదాపు 80శాతం బస్సులను సీఎం సభకు కేటాయించడంతో.. సాధారణ ప్రయాణికులు నరకయాతన పడ్డారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి.. గమ్యస్థానాలకు చేరుకున్నారు. గత ఐదేళ్లలో టిక్కెట్ల ధరలు కూడా భారీగా పెంచేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే.. మహిళలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఉచితమని ప్రకటించడంతో.. చాలా మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే.. ఆర్టీసీ మళ్లీ గాడిన పడుతుందని పలువురు భావిస్తున్నారు. ఈ ప్రభావం మొన్న ఎన్నికల్లో పడి.. విజయావకాశాలను దెబ్బ తీసే ప్రమాదం ఉందని వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

● ఇదీ పరిస్థితి

జిల్లాలోని శ్రీకాకుళం 1,2, పలాస, టెక్కలిలో ఆర్టీసీ డిపోల పరిధిలో 329 బస్సులు ఉన్నాయి. వాటిలో సంస్థకు చెందినవి 220, అద్దెవాహనాలు 87, మరో 22 అదనంగా ఉన్నాయి. 13 లక్షల కిలోమీటర్లు దాటిన బస్సులను కాలం చెల్లినవిగా పరిగణిస్తారు. ప్రస్తుతం పల్లెవెలుగు సర్వీసులన్నీ కాలం చెల్లినవే. సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సులను ఐదు లక్షల కిలోమీటర్లు తిరిగిన తర్వాత.. వాటిని పల్లెవెలుగులుగా వినియోగిస్తారు. ఎక్స్‌ప్రెస్‌లుగా కొత్త బస్సులను కొనుగోలు చేస్తారు. కానీ వైసీపీ పాలనలో కొత్త బస్సుల కొనుగోలు సక్రమంగా జరగలేదు. అలాగే నియామకాలు కూడా చేపట్టలేదు. నాలుగు డిపోల పరిధిలో 60 వరకూ డ్రైవర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెకానిక్‌లు సైతం అరకొరగా ఉన్నారు. దీంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. 40శాతం కాంట్రాక్ట్ సిబ్బందితోనే నడిపిస్తున్నట్టు ఆర్టీసీ యూనియన్ నేతలు చెబుతున్నారు. ఒక్కోబస్సుకు డ్రైవర్, కండక్టర్, గ్యారేజీ మెకానిక్, సహాయకుడు కలుపుకొని ఐదుగురు సిబ్బంది ఉండాలి. కానీ బస్సుల నిష్పత్తి చూసుకుంటే ఇద్దరు కూడా లేని పరిస్థితి. మొత్తం నాలుగు డిపోల్లో 370 మంది వరకూ పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై అదనపు పనిభారం పడుతోంది. డిపోల్లో నిపుణులైన మెకానిక్‌లు లేకపోవడం, విడి పరికరాలు సక్రమంగా సరఫరా కాకపోవడంతో బస్సు మరమ్మతులు జరగడం లేదు. దీంతో బస్సులు మొరాయిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

తరచూ ప్రమాదాలు

● గత ఏడాది అక్టోబరు 16న శ్రీకాకుళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నందిగాం మండలం తురకలకోట వద్ద ప్రమాదానికి గురైంది. స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో.. రోడ్డుపక్కనే ఉన్న గోతిలోకి బస్సు ఒరిగిపోయింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి.

● గత ఏడాది జూన్ 5న నరసన్నపేట సమీపంలో కోమర్తి జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సు బోల్తాపడింది. శ్రీకాకుళం నుంచి పాతపట్నం వెళ్తుండగా స్టీరింగ్ ఊడింది. బస్సు అదుపు తప్పి బోల్తాపడగా.. 19 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి.

..ఇలా జిల్లాలో ఇటీవల ఆర్టీసీ ప్రమాదాలు పెరుగుతున్నాయి. కాలం చెల్లిన బస్సులు సిబ్బందికి, ప్రయాణికులకు రోత పుట్టిస్తున్నాయి. కొత్తగా డిపోలకు చేరిన ఆల్ట్రా డీలక్సులు, సూపర్ లగ్జరీ బస్సులు సైతం మొరాయిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. పగిలిన అద్దాలు, విరిగిన నట్లు రణగొన ధ్వనులతో పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది. అవి ఎక్కడ ఆగిపోయి.. ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది.



కోమర్తి జంక్షన్‌లో బోల్తా పడిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

ఆర్టీసీ చార్జీల పెంపు ఇలా..

మార్గం	2019	ప్రస్తుతం
శ్రీకాకుళం-విశాఖ పల్లెవెలుగు	రూ.90	రూ.105
అల్ట్రాడీలక్స్	రూ.135	రూ.175
శ్రీకాకుళం-రణస్థలం	రూ.25	రూ.45
శ్రీకాకుళం-ఆమదాలవలస	రూ.15	రూ.30
శ్రీకాకుళం-పలాస	రూ.75	రూ.125
శ్రీకాకుళం-టెక్కలి	రూ.55	రూ.85
శ్రీకాకుళం-బొబ్బిలి	రూ.80	రూ.90
శ్రీకాకుళం-కొత్తూరు	రూ.60	రూ.95
శ్రీకాకుళం-పాతపట్నం	రూ.60	రూ.100

● మూడుసార్లు బాదుడే

వైసీపీ ఐదేళ్ల పాలనలో మూడుసార్లు ఆర్టీసీ టిక్కెట్లు పెంచారు. 2019 నాటికి కనీస టిక్కెట్ ధర రూ.5 ఉండగా.. దానిని రూ.10కి పెంచారు. ఎక్స్‌ప్రెస్ కనీస చార్జీని రూ.20కు పెంచారు. జగన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే.. విడి భాగాలు, ఇంధన ధరలు సాకుగా చూపి.. టికెట్ ధరలు పెంచేశారు. 2022 ఏప్రిల్ 14న రెండోసారి భారం మోపారు. 20కిలోమీ టర్లకు రూ.5, 60కిలోమీటర్లకు రూ.10, 90కిలోమీటర్లకు రూ.15కు పెంచుతూ ఉత్తర్వులిచ్చారు. రూ.27, రూ.29 టిక్కెట్ ధరను సైతం చిల్లర సమస్యను సాకుగా చూపుతూ రూ.30 కు పెంచారు. 2022 జూలైలో మరోసారి టిక్కెట్ ధరను పెంచేశారు. 30కిలోమీటర్లకు రూ.5, 70 కిలోమీటర్లకు రూ.10, 70నుంచి 500 కిలోమీటర్ల వరకూ రూ.20 చొప్పున ప్రయాణికులపై భారం మోపారు.

ఆర్టీసీ తీరు దారుణం

వైసీపీ పాలనలో ఆర్టీసీ తీరు దారుణంగా మారింది. కేవలం ప్రధాన మార్గాల్లో మాత్రమే ఆర్టీసీ సర్వీసులకు పరిమితమైంది. దీంతో ప్రజలు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

\- కెల్ల హేమంత్, రణస్థలం

ప్రభుత్వానికి ఆదాయ వనరుగా..

గతంలో ఆర్టీసీ టిక్కెట్ల ధరలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. ఐదేళ్లలో మూడుసార్లు భారీగా టిక్కెట్ల ధరలు పెంచడంతో.. సామాన్యులపై భారం పడుతోంది. ఆర్టీసీ.. ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మారింది.

\- డి.కిషోర్, రణస్థలం

'తెలంగాణ'లో సిక్కోలు సత్తా

- ఈఏపీసెట్‌లో జ్యోతిరాదిత్యకు స్టేట్‌ఫస్ట్

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలంగాణ రాష్ట్రంలో సిక్కోలు విద్యార్థి సత్తా చాటాడు. శ్రీకాకుళం నగరానికి చెందిన సతివాడ జ్యోతిరాదిత్య తెలంగాణ ఈఏపీసెట్‌లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. దీంతో తెలుగురాష్ట్రాల్లో సిక్కోలు విద్యార్థి ప్రతిభ మార్మోగుతోంది. జ్యోతిరాదిత్య తల్లిదండ్రులు సతివాడ మోహనరావు, హైమావతి. మోహనరావు స్వస్థలం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పాలకొండ మండలం యరకరాయపురం. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఖైరవానిపేటలో నివసిస్తున్నారు. తండ్రి మోహనరావు ఎచ్చెర్లలో సోషల్‌వెల్ఫేర్ పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి హైమావతి శ్రీకాకుళం ఆర్టీసీ డిపోలో సిస్టమ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు జ్యోతిరాదిత్యతో పాటు బీడీఎస్ చదువుతున్న కుమార్తె ఉషశ్రీ ఉంది. జ్యోతిరాదిత్య విజయవాడలోని చైతన్యలో ఇంటర్ చదివి 953 మార్కులు సాధించాడు. అక్కడే ఐఐటీ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నారు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌కు హాజరై ఆల్‌ఇండియాస్థాయిలో 116వ ర్యాంకు కైవం చేసుకున్నాడు. తాజాగా శనివారం విడుదలైన తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో ఏకంగా స్టేట్‌ఫస్ట్ సాధించాడు. ప్రస్తుతం విజయవాడలో ఉన్న జ్యోతిరాదిత్య 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడుతూ.. ముంబయి లేదా ఢిల్లీలో ఐఐటీ చేయడమే తన లక్ష్యమని తెలిపాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే మంచి ర్యాంకు సాధించానని వెల్లడించాడు. జ్యోతిరాదిత్యకు స్టేట్‌ఫస్ట్ రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. కుమారుడుకి అభినందనలు తెలిపారు.



జ్యోతిరాదిత్యను అభినందిస్తున్న తల్లి హైమావతి

సాహితికి 125వ ర్యాంకు



సాహితి

జలుమూరు: తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో నగిరికటకం గ్రామానికి చెందిన బేరి సాహితి 125వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచింది. తండ్రి వెంకటరావు విజయవాడలో అగ్ని మాపక కేంద్రంలో హెచ్‌సీగా, తల్లి అరుణ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరు ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నారు. 10వ తరగతి వరకు గరివిడిలో చదివిన సాహితీ ఇంటర్ విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకొంది. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో సాహితి 508వ ర్యాంకు సాధించి ఔరా అనిపించింది. ఓబీసీలో 84వ ర్యాంకు సాధించింది. ఎంసెట్‌లో 125వ ర్యాంకు సాధించిన సాహితిని గ్రామస్థులు అభినందించారు.

ఎలా ఉన్నారో?

- కిర్గిస్థాన్‌లో చిక్కుకున్న 250 మంది వైద్య విద్యార్థులు
- అక్కడ అల్లర్ల నేపథ్యంలో తల్లిదండ్రుల్లో ఆందోళన
- క్షేమ సమాచారంపై ఆరా
- భద్రత కల్పించాలంటూ విదేశాంగ శాఖ మంత్రికి ఎంపీ రామ్మోహన్‌నాయుడు లేఖ

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి/రణస్థలం, మే 18)

విదేశాల్లో వైద్య విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. కిర్గిస్థాన్ రాజధానిలో బిష్కెక్‌లోని అంతర్జాతీయ విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని.. మూకహింస చెలరేగింది. ఈ నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ దేశాలు స్పందించాయి. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని.. నివాస ప్రాంతాల నుంచి ఎవరూ బయటకు రావద్దని శనివారం సూచించాయి. కాగా.. కిర్గిస్థాన్‌లో ఏపీకి చెందిన రెండు వేల మంది విద్యార్థులు చిక్కుకున్నారు. అందులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 250 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమ పిల్లలు ఎలా ఉన్నారోనని కంగారుపడుతూ.. వారి ఆచూకీ కోసం ఆరాట పడుతున్నారు. విద్యార్థినులకు ఫోన్ చేసి.. క్షేమసమాచారాలు తెలుసుకుంటున్నారు. అందరూ ప్రస్తుతం క్షేమంగానే ఉన్నామని చెప్పడంతో కాస్త ఊరట చెందుతున్నారు.

● కొద్దిరోజుల కిందట ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఏపీకి చెందిన చాలామంది వైద్య విద్యార్థులు చిక్కుకున్నారు. ఆ సమయంలో భారత ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి అక్కడ వైద్య విద్యార్థులను స్వదేశానికి రప్పించింది. అయితే ఇండియాలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో కిర్గిస్థాన్‌లో అల్లర్లు జరగడం భారత వైద్య విద్యార్థులకు శాపంగా మారింది. ఇక్కడ ఇంటర్ విద్య పూర్తిచేసుకున్న చాలా మంది విద్యార్థులు వైద్య వృత్తికోసం ఉక్రెయిన్, కిర్గిస్థాన్ లాంటి దేశాలను ఆశ్రయిస్తుంటారు. అక్కడ అంతర్జాతీయ వివాదాలు, ఇతర దేశాలతో ఉన్న విభేదాలు, సరిహద్దు వివాదాల యుద్ధాలతో భారత విద్యార్థులు నష్టపోవడం ఆనవాయితీగా వస్తోంది. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం నేపథ్యంలో వేలాదిమంది భారత వైద్య విద్యార్థులు విద్యా సవంవత్సరాన్ని నష్టపోయారు. చాలా రోజులు ఇండియాలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో వందలాది మంది ఇబ్బందిపడ్డారు. సదరు యూనివర్సిటీలు, మెడికల్ కాలేజీలు ప్రత్యామ్నాయాన్ని చూపాయి. అది మరువకముందే తాజాగా కిర్గిస్థాన్‌లో అటువంటి పరిస్థితి ఏర్పడింది. దేశ అంతర్గత వ్యవహారంలో తలెత్తిన ఇబ్బందులతో భారత దేశానికి చెందిన వైద్య విద్యార్థులు చిక్కుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

● రణస్థలం మండల కేంద్రానికి చెందిన విద్యార్థి తల్లి మహంతి శ్రీదేవి మాట్లాడుతూ కిర్గిస్థాన్ పిల్లలు అగమ్యగోచర స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలుగజేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● ఎచ్చెర్ల మండలం చిలకపాలెంకు చెందిన విద్యార్థి తండ్రి వెంకునాయుడు మాట్లాడుతూ కిర్గిస్థాన్‌లో పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

● మరో విద్యార్థి తల్లి కుసుమిత మాట్లాడుతూ.. తన కొడుకు రెండో సంవత్సరం మెడిసిన్ చేస్తున్నాడని, ఈ అల్లర్లు తెలియడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని తెలిపారు. తక్షణం కేంద్రం కలుగజేసుకోవాలని కోరారు. అంతర్జాతీయంగా ఎటువంటి సమస్యలు తలెత్తినా భారత విద్యార్థులు చిక్కుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. అందుకే భారత విద్యార్థుల కోసం పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

● బీజేపీ సీనియర్ నాయకుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. భారత రాయబార కార్యాలయాలతో మాట్లాడి సత్వర చర్యలు చేపడుతున్నామన్నారు. కిర్గిస్థాన్‌లో చిక్కుకున్న వారిని స్వస్థలాలకు రప్పించేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

● ఈ ఘటనపై శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పందిస్తూ.. విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్‌కు ప్రత్యేక లేఖ రాశారు. కిర్గిస్థాన్‌లో జరుగుతున్న గొడవల్లో రాష్ట్రానికి చెందిన వైద్యవిద్యార్థుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని లేఖలో వివరించారు. విద్యార్థులకు భద్రత కల్పించాలని కోరారు. అలాగే విద్యార్థులు ఎవరూ బయటకు రాకుండా మార్గదర్శకాలు పాటించాలని రామ్మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు కూడా ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.



కిర్గిస్థాన్‌లో మెడిసిన్ చదువుతున్న ఉత్తరాంధ్ర విద్యార్థినులు



అనన్య



అసిష్‌సాయి

క్షేమమే..

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలో ముగ్గురు విద్యార్థినులు.. కిర్గిస్తాన్ దేశంలో వైద్య విద్యనభ్యసిస్తున్నారు. ఆ ముగ్గురూ క్షేమంగా ఉన్నట్టు తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఊపిరిపీల్చుకున్నారు. సరుబుజ్జిలి మండలం నందికొండకు చెందిన కూన జగన్నాథం కుమార్తె మాధురి, కొత్తకోటకు చెందిన డోల రామకృష్ణ కుమార్తె శ్వేత.. కిర్గిస్తాన్ దేశంలోని జలీలాబాద్ రాష్ట్రంలో జలీలాబాద్ మెడికల్ యూనివర్శిటీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. నందికొండకు చెందిన సుంకర రమణ కుమార్తె హేమని కూడా అదే దేశంలోని.. ఒక మెడికల్ యూనివర్శిటీలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం అక్కడ దాడుల సంఘటన నేపథ్యంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతుండగా.. తాము క్షేమంగానే ఉన్నట్టు ఆ విద్యార్థినులు వీడియోకాల్ ద్వారా సమాచారం అందించారు. ప్రస్తుతానికి తమ ప్రాంతంలో ఎటువంటి అల్లర్లు, దాడులు లేవని.. విద్యార్థులెవరినీ బయటకు పంపించకుండా యూనివర్శిటీ యాజమాన్యం చర్యలు తీసుకుందని తెలిపారు. దీంతో విద్యార్థినుల తల్లిదండ్రులు ఊరట చెందారు.





కిర్గిస్థాన్‌లో క్షేమంగా ఉన్న వైద్య విద్యార్థులు మాధురి, శ్వేత, హేమని

ధర ఉన్నా.. దిగుబడి లేదు!

- జీడిపిక్కల బస్తా రూ.10వేలు
- ఆశించిన స్థాయిలో పంట లేక రైతుల దిగాలు

పలాస, మే 18: జీడి పిక్కలకు ధర ఉన్నా దిగుబడి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎకరాకు ఆరు బస్తాల వరకు దిగుబడి వస్తే ప్రస్తుతం కనీసం రెండు బస్తాలు కూడా రావడం లేదు. ధరలు బాగున్న సమయంలో పిక్కలు లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలో ప్రస్తుతం ఉద్దానంతో పాటు ఏజెన్సీ ప్రాంతంలో 27 వేల హెక్టార్లలో జీడి పంట సాగవుతోంది. అయితే, ఈ ఏడాది పంట ప్రారంభ దశలోనే టీ దోమ విజృంభిస్తుండడంతో జీడి పూత రాలిపోయింది. అలాగే పిక్కలు మసిబారి చెట్ల కింద కుప్పలుగా రాలిపోయాయి. దీంతో దిగుబడి అమాంతం పడిపోయింది. ముఖ్యంగా తితలీ తుఫాను తరువాత ఉద్దానం రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. కొత్త చెట్లు కావడంతో దిగుబడి అంతంత మాత్రంగా వస్తోంది. ఎకరాకు కనీసం రెండు బస్తాల దిగుబడి కూడా రావడం లేదు. జిల్లాలో 400 వరకూ జీడి పరిశ్రమలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం, ఎన్నికలు పూర్తి కాగానే జీడి పిక్కల ధర కిలో రూ.125 పలుకుతోంది. పొరుగు రాష్ట్రాల జీడి పిక్కల ధర కిలో రూ.115 నుంచి 120 వరకూ ఉండడంతో కొనుగోళ్లపై వ్యాపారులు ఆసక్తి చూపిస్తున్నారు. రెండు నెలల ముందు వరకూ జీడి పిక్కల బస్తా (80 కేజీలు) ధర రూ.6వేల నుంచి రూ.7వేలు ఉండేది. ప్రస్తుతం రూ.10వేలు పలుకుతోంది. ఇటీవల జీడిపప్పు రేట్లు పెరగడంతో పలాస మార్కెట్ కళకళలాడుతోంది. బ్రోకర్లు వ్యాపారుల వద్ద జీడి పప్పు కొనుగోలు చేసుకొని రైలు, ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు వస్తున్నారు. అయితే, ధర ఉన్నా జీడి పిక్కలు లేక రైతులు ఆవేదన చెందుతున్నారు. నిల్వ ఉన్న స్వదేశీ పిక్కలను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.



పీలింగ్ చేయడానికి ఎండబెట్టిన జీడిపిక్కలు

రూ.16వేలు ప్రకటించాలి

ప్రస్తుతం పెరిగిన జీడిపిక్కల ధర ఆశాజనకమే అయినా ఇంకా పెరిగితే రైతులు నష్టాలనుంచి గట్టెక్కుతారు. గత ఏడాది దిగుబడి ఉన్న సమయంలో 80 కిలోల బస్తా రూ.14,500 ఉండేది. ప్రస్తుతం తెగుళ్లతో దిగుబడి పడిపోయింది. ఈ సమయంలో కనీసం రూ.16వేలు ప్రకటిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది.

\- మద్దిల వినోద్‌కుమార్, ఉద్దానం రైతు పోరాట నాయకుడు

పిక్కల ధర పెరిగింది

జీడి పప్పుకు మార్కెట్ వస్తున్న కారణంగా పిక్కల ధర పెరిగింది. మంచి మార్కెట్ ఉంటే రైతులకు, వ్యాపారులకు న్యాయం జరుగుతుంది. ఇప్పటి వరకూ సరైన మార్కెటింగ్ లేక వ్యాపారులు కూడా నష్టాలకు గురైన విషయాన్ని గుర్తించాలి.

\- మల్లా సురేష్, జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, పలాస

స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్ఠ భద్రత

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎం.కె.మీనా

గుజరాతీపేట, మే 18: ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూముల వద్ద పటిష్టమైన భద్రత పాటించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్, ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి శనివారం పరిశీలించారు. ఈవీఎం కంట్రోల్ రూమ్‌ను, మూడంచెల భద్రతా ఏర్పాట్లను, సీళ్లను, సీసీ కెమెరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌రూమ్ పరిసర ప్రాంతాల్లోకి అనుమతించరాదన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, టెక్కలి రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు సీహెచ్ రంగయ్య, భరత్‌నాయక్, అప్పారావు, రామ్మోహన్‌రావు, లక్ష్మణమూర్తి, సుదర్శన దొర, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంకే మీనా

హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా క్రియేషన్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నోరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్ధార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.

రొమాంటిక్ సిల్క్ శారీ




వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.

శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ



చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్.

అర్హత: సీఎస్ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయుల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్టులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎస్సీలో బీటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VTVnpuoలో చదవండి.

నిర్లక్ష్యం



నరసన్నపేట మండలం జమ్ము వద్ద జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు స్థానికులు అమర్చిన టైర్

జమ్ము జంక్షన్ నుంచి పాతపట్నం వరకు 326ఏ స్టేట్ హైవేపై పలు ప్రాంతాల్లో రోడ్డు అస్తవ్యస్తంగా ఉంది. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్వహణపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమ్ము జంక్షన్ వద్ద 40వ కిలోమీటర్ మైలు రాయి వద్ద రోడ్డు కుంగిపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్థులు లారీ టైర్‌ను సంబంధిత గొయ్యిపై ఉంచి కొంతమేర నివారణ చేశారు. అయితే జాతీయ రహదారిని మూడేళ్ల పాటు నిర్వహించాల్సిన సంస్థ ప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఈ మార్గంలో కల్వర్టుల వద్ద ప్రమాద సూచికలను ఏర్పాటు చేయలేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుతో పాటు కల్వర్టుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.

-నరసన్నపేట

ప్రమాదకరం



సీది గ్రామ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు

సీది కూడలి మొదలుకొని సోద గ్రామం ఉన్న మార్గంలో పలు చోట్ల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల ఇరువైపులా ఎటువంటి ప్రమాద హెచ్చరికలు లేకపోవడం, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి సమయాల్లో ఈ పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈమార్గం గుండా సీది, తామర, తీమర, పాశిగంగుపేట లతో పాటు సోద పంచాయతీ పరిధిలోని వివిధ గిరిజన గూడలకు, కొమ్మనాపల్లి, రుగడ మీదుగా మాతల వెళ్లే ఈ మార్గంలో నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే మలుపుల వద్ద చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకొని ప్రమాదాలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-పాతపట్నం

దారేదీ?



రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో దారి లేకుండా నిలిపిన ద్విచక్ర వాహనాలు

మందస రాజావారి కోట ఆవరణలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మీసేవ కేంద్రాలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కోట ఆవరణలో మేడపై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కింద గదిలో మీసేవ కేంద్రాలున్నాయి. అయితే వివిధ పనులపై కార్యాలయాలకు వచ్చే వారు ద్విచక్ర వాహనాలను ఎలా పడితే అలా పార్కింగ్ చేస్తుండడంతో ప్రజలు వాటిని దాటుకుని వెళ్లేందుకు ఇక్కట్లు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు సరైన దారి లేకపోవడంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికై వాహనాలను సక్రమంగా పార్కింగ్ చేసి కార్యాలయాలకు దారి వదిలేలా వాహనదారులు సహకరించాలని పలువురు కోరుతున్నారు.

-మందస

పోలీసులు అలెర్ట్

- నిఘా సంస్థలు, ఉన్నతాధికారుల ఆదేశాలతో..
- అల్లర్లు జరగకుండా చర్యలు

పలాస, మే 18: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాల ప్రకటనకు సమయమున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. నిఘా సంస్థలు, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో సమస్యాత్మక గ్రామాలు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. పోలింగ్ రోజునే పలాస నియోజకవర్గంలో చిన్నబడాం, కాశీబుగ్గ, పలాస, పురుషోత్తపురం, టెక్కలిపట్నం, రెంటికోట, బంటుకొత్తూరు, బ్రాహ్మణతర్లా, గరుడఖండి, లక్ష్మీపురం, చినంచల, పెదంచల గ్రామాల్లో చిన్న ఘర్షణలు జరగ్గా పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టిన విషయం విదితమే. వజ్రపుకొత్తూరు మండలం పెద్దమురహరిపురం, నువ్వలరేవు ప్రాంతాల్లో ప్రధాన అభ్యర్థులనే ప్రజలు నిలువరించిన నేపథ్యంలో ఆ ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పాటుగా మందస మండలం ఉద్దానం ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు, బాలిగాం ప్రాంతాలు కూడా సమస్యాత్మకంగా గుర్తించారు. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ముందస్తుగానే ప్రత్యేక నిఘా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు: డీఎస్పీ

కౌంటింగ్ తరువాత గాని, ముందుగాని గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి హెచ్చరించారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సమస్యాత్మక గ్రామాలను గుర్తించామన్నారు. రౌడీషీటర్లను పిలిపించి బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే కార్యక్రమాలను నాయకులు చేసేందుకు వీలు లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నరసన్నపేట: స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ నిర్మాణం జరిగి 150 ఏళ్లు అయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు రుత్వికులు చామర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పరిషత్ విజ్ఞాపన, రక్షా సూత్రధారణ, పంచగవ్య ప్రాశన తదితర కార్యక్రమాలు చేపట్టారు. వేద పండితుల వేద మంత్రాల మధ్య యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠతో పాటు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి శోభయాత్ర నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, కోలట ప్రదర్శన, తప్పిటగుళ్ల విన్యా సాల నడుమ తిరువీధి చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ నిర్వాహకులు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్‌ను కోరారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త పి.చిన్న వీరభద్రస్వామి, కమిటీ సభ్యుడు ఎం.జగదీష్ తదితరులు ఆహ్వానపత్రిక అందించి సత్కరించారు.

నేటి నుంచి వాహన సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి వాహన సేవలు నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటల నుంచి హంస వాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు. ప్రతిరోజు సుప్రభాతసేవ, తిరువారాధన, మంగళాశాసనం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చామర్తి సత్య సాయి కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



నరసన్నపేట: పల్లకిలో స్వామి వారి తిరువీధి

ఘనంగా వెంకన్న స్వామి గరుడ వాహన సేవ

నందిగాం: పెంటూరులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం 22వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం గరుడ వాహన సేవ ఘనంగా జరిగింది. ఆలయ ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో సా యంత్రం మేళతాళాలు, భజనల మధ్య గరుడ వాహనంపై స్వామి వారి ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల కోలాట ప్రదర్శన, ఈ సందర్భంగా బాలక శంకరరావు వేంకటేశ్వర స్వామి వేషధారణ ఆకట్టుకున్నాయి. ఉదయం శ్రీకూర్మంకు చెందిన వేదపండితులు, గోపినంబాళ్ల వెంకటదాస్, దేవస్థాన ప్రధాన అర్చకులు డి.రవిరామాచార్యులు పర్యవేక్షణలో అష్టదిక్పాలక వాహన గరుడ ప్రతిష్ఠ, ధ్వజారోహణ, మంగళా శాసనాలు నిర్వహించారు. జడా నారాయణరావు ఆధ్వర్యంలో భజనలు చేపట్టారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



నందిగాం: గరుడవాహనంపై వేంకటేశ్వరుని తిరువీధి ఉత్సవం



కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

కరాటేలో ప్రత్యూష ప్రతిభ

- మలేషియా ఓపెన్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్

హరిపురం: మలేషియాలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఏడేళ్ల చిన్నారి దున్న ప్రత్యూష విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. మందస మండలం దున్నూరుకు చెందిన దున్న కృష్ణారావు, స్వాతి దంపతుల కుమార్తె ప్రత్యూ ష. వీరు హైదరాబాద్ లో వలస కూలీగా జీవనం సాగిస్తున్నారు. కుమార్తెకు స్థానికంగా కరాటే స్కూల్‌లో శిక్షణ ఇప్పించారు. దీంతో విదేశాల్లో జరిగిన పోటీలో పాల్గొని తన సత్తా చాటి సిక్కోలు ఖ్యాతిని ఇనుమడింప జేసింది. ఈ నేపథ్యంలో స్వగ్రామంలో స్థానికులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



గోల్డ్ మెడల్‌తో దున్న ప్రత్యూష

సమయపాలన పాటించకుంటే చర్యలు

ఎల్.ఎన్.పేట: కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు చేపట్టడం జరుగుతుందని టెక్కలి డివిజన్ డీఎల్పీవో ఎల్.అలివేలు మంగమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం సందర్శించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఎంపీడీవో టేబుల్‌పై ఉన్న ఉపాధి హామీ ఎంబుక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామ సచివాల యాలను ఎప్పటికప్పు డు ఆకస్మికంగా తనిఖీ చేపట్టి సిబ్బంది పనితీరు పరిశీలించడం జరుగుతుంద న్నారు. సిబ్బంది ఫీల్డ్‌కు వెళ్లేటప్పుడు సచివాలయంలోని మూమెంట్ రిజిస్టర్లలో రికార్డు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆమెతో పాటు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

శ్రమదానం చేసి సిల్ట్ తొలగింపు

రాళ్లపాడుకాలనీ(పోలాకి): రాళ్లపాడు పంచాయతీ జగన్నాథ కాలనీలో స్థానిక యువత శ్రమదానం చేసి కాలువల్లోని సిల్ట్‌ను తొలగించారు. యువజన సంఘ సభ్యుల జన్మదినం రోజున కాలువలను శుభ్రం చేయడం, మొక్కలు నాటడం, ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం కాలనీ కమిటీ నాయకుడు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసిపాటి కృష్ణంరాజు పుట్టిన రోజు సందర్భంగా కాలువల్లోని చెత్తా చెదారాలను తొలగించామని సభ్యులు తెలిపారు. కాలనీ సమస్యలను సచివాలయ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, తాగునీరు అందించాలని ఇళ్లు మంజూరు చేయాలని కోరామన్నారు. అలాగే పంచముఖాంజనేయస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేసినట్లు తెలిపారు. శ్రమదానం చేసిన యువతకు యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ బోర సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ చిట్టి సింహాచలం తదితరులు అభినందించారు.

గ్రామదేవతకు ముర్రాటలు



ఘటాలతో ఆలయానికి వస్తున్న మహిళలు, గ్రామస్థులు

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేటలో జరుగుతున్న గ్రామదేవత బంగారు సంతోషిమాత ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామస్థులు గ్రామదేవతకు చల్లదనం చేసి ముర్రాటలు సమర్పించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలతో కలశాలు, ఘటాలను తలపై ఉంచుకుని మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఈనెల 28 నుంచి గామ దేవత రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని గ్రామపెద్దలు తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

టెక్కలి: స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు అర్చకులు సీహెచ్ రమణాచార్యులు తెలిపారు. ఈనెల 23 వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేటినుంచి భగవద్గీత సప్తాహం జ్ఞానయజ్ఞం

టెక్కలి: స్థానిక పెద్దబ్రాహ్మణ వీధి జంక్షన్‌లోని చంద్రశేఖరస్వామి ఆలయంలో శ్రీమద్భాగవత సప్తాహం జ్ఞానయజ్ఞం నిర్వహించనున్నట్లు మహంత్ మదన్ గోపాల్ దాస్‌జీ మహరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు భాగవత పారాయణం, ప్రవచనాలు తదితర కార్యక్రమాలు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. 20 నుంచి 27 వరకు అష్టప్రహరీ హరినామ సంకీర్తన జరుగుతుం దని, చివరిరోజు 27న అన్నప్రసాద వితరణ చేపడుతున్నామన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో వీఆర్వో మృతి

కొత్తూరు: మండలంలోని గూనభద్ర సచివాలయంలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న గొట్టిపల్లి గ్రామానికి చెందిన గొర్లె రమేష్ కొద్ది రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. శ్రీకాకుళంలోని ఆసుపత్రిలో చికిత్స పొందు తుండగా ఆరోగ్యం మరింత క్షీణించడంతో శనివారం మృతి చెందాడు. రమేష్‌కుమార్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరు ఏడు, మూడు తరగతులు చదువు తున్నారు. రమేష్ మృతి పట్ల రెవెన్యూ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.



రమేష్ (ఫైల్)

వేడుకగా కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

పర్లాకిమిడి: పర్లాకిమిడిలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మణిబాబు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవాసవి మాత మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, నగలతో అలకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు చేశారు. 108 సువా సినులతో లలితా సహస్ర నామ పారాయణం, కుంకు మార్చనలు చేయించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



కాలువలిలా.. సాగునీరెలా?

(గార)

గార మండలంలో సాగు నీటి కాలువలు ఏళ్ల తరబడి ఎటువంటి అభివృద్ధి పనులు లేక పూడికలు, పిచ్చి మొక్కలు పెరిగి రూపు కోల్పో తున్నాయి. మండల పరిధిలో 16 వేల ఎకరాల భూమికి నీరందించే భైరి లింక్ కాలువ దయనీయంగా తయారైంది. కాలువలో చాలా చోట్ల పూడిక, పిచ్చి మొక్కలు పెరిగిపోయి నీరు వెళ్లే పరిస్థితి లేదు. కాలువ గట్లు అనేక చోట్ల బలహీన పడ్డాయి. ఈ కాలువకు అనుసంధానంగా బూరవెల్లి, శాలి హుండాం, గార, కొర్ని, కొర్లాం, వమరవెల్లి, తోణంగి, కళింగపట్నం తదితర గ్రామాల పిల్ల కాలువల్లో కేవలం ఉపాధి వేతనదారులు చేస్తున్న పనులు తప్ప సంబంధిత శాఖ ఎటువంటి మరమ్మతు పనులు చేప ట్టడం లేదు. దీంతో శివారు ప్రాంతాలకు ఖరీఫ్‌లో పూర్తి స్థాయిలో సాగునీరందే పరిస్థితి లేకపో వడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇక వంశధార, నారా యణపురం కాలువలు పరిస్థితి ఇదే. వంశధార కాలువ ద్వారా అంపోలు, సతివాడ, సవిరిగాం, వత్సవలస, శ్రీకూర్మం తదితర ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాడాడ, రామచంద్రపురం, దీపావళి తదితర ప్రాంతాలకు సాగు నీరందించే పిల్ల కాలువలో పూడికలు పెరిగిపోయింది. గతంలో సాగునీటి సంఘాల ద్వారా ఖరీఫ్ సీజన్‌కు ముందు ఆ శాఖాధికారులు సాగునీటి కాలువలు, చెరువులు బాగు చేయించేవారు. ఇప్పుడు ఆ సంఘాలు లేకపోవడంతో పాటు జలవనరులు శాఖకు నిధుల లేమి కారణంగా గత కొన్నేళ్లుగా సాగునీటి కాలువలు మరమ్మ తులకు నోచుకోలేదు. మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో వ్యవసాయ పనులు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. అయితే సాగునీటి కాలువల్లో సిల్ట్, పిచ్చిమొక్కలు పెరిగి పోవడంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



గార వద్ద గుర్రపు డెక్క, చెత్తా చెదారాలతో నిండిపోయిన భైరి సాగునీటి కాలువ

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి


చిన్నమ్ముడు (ఫైల్)

నరసన్నపేట: తామరాపల్లి గ్రామం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ధర్మాన చిన్నమ్ముడు (65) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. తామరాపల్లి గ్రామం వద్ద జాతీయ రహదారి దాటుతున్న సమయంలో టెక్కలి నుంచి నరసన్నపేట వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నమ్ముడుకు తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. చిన్నమ్ముడు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభం పడి వ్యక్తి మృతి

పొందూరు: రెడ్డిపేట సమీపంలో జరుగుతున్న విద్యుత్ లైన్ ఏర్పాటు సమయంలో ప్రమాదవశాత్తు స్తంభం పడడంతో పాగోటి ధర్మారావు(52) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం మండలం సింగుపురం పంచాయతీ మామిడివలస గ్రామానికి చెందిన పాగోటి ధర్మారావు, రెడ్డిపేట - తాణేం గ్రామాల మధ్యలో విద్యుత్ స్తంభాల ఏర్పాటులో భాగంగా వెల్డింగ్ పనుల కార్మికుడిగా ధర్మారావు వచ్చాడు. శుక్రవారం సాయంత్రం విద్యుత్ స్తంభం పైకి లేపుతుండగా ప్రమాదవశాత్తు అది ధర్మారావుపై పడింది. దీంతో ధర్మారావు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తోటి కార్మికులు స్పందించి శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

జూలై నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు


సమావేశంలో పాల్గొన్న పీపీలు, ఏపీపీలు

గుజరాతీపేట: దేశంలో జూలై 1వ తేదీ నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వస్తాయని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసెక్యూషన్స్, ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పీపీ మెట్ట మల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా కోర్టుల సముదాయంలో శనివారం నెలవారీ జిల్లా పబ్లిక్ ప్రాసెక్యూటర్స్ జరిగే సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సన్హిత 2023 (పాత ఐపీసీ 1860), భారతీయ సాక్షి అధినియం 2023 (పాత ఎవిడెన్స్ యాక్ట్ 1872), భారతీయ నాగరిక సురక్ష సంహిత 2023 (పాత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973) తదితర కొత్త క్రిమినల్ చట్టాల అమలులోకి వస్తాయన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో సెంట్రల్ డిటెక్టివ్ ఇనిస్టిట్యూట్‌లో కేంద్ర హోమ్ శాఖ ఆధ్వర్యంలో ట్రైనింగ్ నిర్వహించారన్నారు. సమావేశంలో జిల్లా ఫ్యామిలీ కోర్టు పీపీ వానకృష్ణచంద్, ఏపీపీలు టి.శివ ప్రసాదరావు, సీహెచ్ శ్రీకాంత్, కె.తిరుమలరావు, కె.శంకరరావు, ఎల్‌వీ రమణ, సీహెచ్ సత్యనారాయణ, కె.ఉషారాణి, ఉషాకిరణ్, కె.సూర్యకుమార్, ఎల్.నాగభూషణం, పి.సుశీల, కె.సుధారాణి, జి.ప్రియదర్శిని, ఆర్.శాంతి సంతోషి, వి.విజయలక్ష్మి, డి.హరి ప్రియ, ఎల్.రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్లమో పారామెడికల్ ఫలితాల్లో 'బొల్లినేని' విద్యార్థుల ప్రతిభ


అధిక మార్కులు సాధించిన విద్యార్థినులు

శ్రీకాకుళం క్రైం: డిప్లమో పారామెడికల్ ఫలితాల్లో బొల్లినేని విద్యార్థులు ప్రతిభ చూపినట్టు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలైడ్ అండ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ విడుదల చేసిన ఫలితాల్లో తమ సంస్థ విద్యార్థులు సత్తా చాటారన్నారు. డిప్లమో ఇన్ కాథ ల్యాబ్ టెక్నాలజీ విద్యార్థిని పేడాడ లలితకుమార్ 360కు 306 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిందన్నారు. డిస్టింక్షన్లో నలుగురు విద్యార్థులు ప్రథమ శ్రేణి, 24 విద్యార్థులు తమ కళాశాలలో మంచి ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులను సంస్థ అకడమిక్ డైరెక్టర్ లక్ష్మీ పద్మజ అభినందించారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయన్నారు. వివరాలకు 76809 45357, 79950 13422 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలల హక్కులు పరిరక్షించుకోవాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి మణి

ఆమదాలవలస: భారత రాజ్యాంగం ప్రకారం బాలలకు కల్పించిన హక్కులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆమదాలవలస జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఎస్.మణి అన్నారు. శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో అనురాధ ఆధ్వర్యంలో బాలల హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయాధికారి మణి మాట్లాడుతూ.. బాలల హక్కులను హరించే ఎంతటివారిని అయినా శిక్షించడానికి న్యాయ విభాగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీబాయ్, ఏజీపీ సేపాన గోవిందరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీబాయి, లీలారాణి, జీవీ రత్నం పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడిగా 'సూర'


బాబా చిత్రపటం వద్ద ప్రమాణం చేస్తున్న రామచంద్రరావు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడిగా సూర రామచంద్రరావు శనివారం సత్యసాయి పెద్దమందిరంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భక్తుల సహకారంతో సంస్థ సేవలు విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రిలో, టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో పాతపట్నం కమ్యూనిటి ఆసుపత్రిలో రోగుల సహాయకులకు ప్రతీరోజూ మధ్యాహ్నం, రాత్రి అన్న ప్రసాదం అందజేస్తున్నట్టు తెలిపారు. వృద్ధులకు క్యారేజీల ద్వారా కూడా అన్నప్రసాదం సుమారు 250 మందికి అందచేస్తున్నట్టు తెలియజేశారు. వైద్య సేవలు పశు వైద్య, రక్తదాన సేవలు, చలివేంద్ర సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పచ్చిరొట్ట విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

సోంపేట: పచ్చిరొట్ట విత్తనాలకు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహనరావు కోరారు. బారువలో విత్తనాల పంపిణీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలకోసం నమోదు చేసుకుంటే వచ్చేవారం నుంచి విత్తనాల పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఏవో నర్సింహమూర్తి తదితరులు ఉన్నారు.

ఐటీఐతో ఉపాధి

- ఆసక్తి చూపిస్తున్న యువత
- వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

(ఎచ్చెర్ల)


ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐ

ఐటీఐ (పారిశ్రామిక శిక్షణ సంస్థ)లో చేరితే తక్కువ సమయంలో ఉపాధి పొందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పాలిటెక్నిక్, వృత్తి విద్యా కోర్సులు అందుబాటులోకి వచ్చినా ఐటీఐకి ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు. గత దశాబ్దం కాలంగా ఐటీఐలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఐటీఐ పూర్తయిన తర్వాత నేరుగా పాలిటెక్నిక్ డిప్లమో రెండో సంవత్సరంలో చేరే అవకాశం కూడా ఉంది. ఐటీఐ పాసైతే వివిధ సంస్థల్లో, పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. ఈ కారణంగా ఐటీఐ చదివేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు.

పెరిగిన గిరాకీ

మూడు, నాలుగు దశాబ్దాల క్రితం ఐటీఐ సీటు దక్కించుకోవడమే చాలా కష్టంగా ఉండేది. గతంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులు సైతం ఐటీఐ కోర్సులో చేరేవారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో సీటు లభించలేదంటే బొబ్బిలి, విశాఖ వంటి సుదూర ప్రాంతాలకు కూడా వెళ్లి ఐటీఐ కోర్సులో సీట్ల కోసం ప్రయత్నించేవారు. అలాంటి పరిస్థితి అప్పట్లో ఉండేది. దశాబ్దం క్రితం ఐటీఐ కోర్సులకు బొత్తిగా డిమాండ్ లేకుండా పోయింది. ఇప్పుడు మళ్లీ క్రమేణా ఐటీఐ కోర్సులు పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తోంది. పదో తరగతి ఉత్తీర్ణులైన తర్వాత ఐటీఐ కోర్సు పూర్తిచేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం గ్యారెంటీ కావడంతో యువత ఇటు వైపుగా ముందుకు సాగుతున్నారు. దీంతో ఐటీఐ కోర్సులకు తిరిగి గిరాకీ ఏర్పడింది. వెల్డర్ మినహా మిగిలిన కోర్సులకు పదో తరగతి చదివిన వారు అర్హులు. వెల్డర్ కోర్సుకు ఏడో తరగతి ఉత్తీర్ణులై పదో తరగతి చదివితే సరిపోతుంది. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వచ్చే నెల 10వ తేదీలోగా ఐటీఐ డాట్ ఏపీ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న అప్లికేషన్‌ను, ఒరిజనల్ సర్టిఫికేట్లను సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో వచ్చే నెల 10వ తేదీలోగా వెరిఫికేషన్ చేయించుకుంటేనే అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అర్హులవుతారు. ఐటీఐ చదివిన వారికి రైల్వేలో, ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్, ఆర్టీసీ, స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డ్, కెమికల్ పరిశ్రమలు, డిఫెన్స్, ఆర్టీసీ తదితర శాఖల్లో ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయి.

జిల్లాలో ఐటీఐల వివరాలు

జిల్లాలో ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాసలో ప్రభుత్వ ఐటీఐలు, 20 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. ప్రభుత్వ ఐటీల్లో 720 సీట్లు, ప్రైవేటు ఐటీఐల్లో 3,056 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఫిట్టర్: ఐటీఐ కోర్సుల్లో ఫిట్టర్ ఎవర్ గ్రీన్ కోర్సు. ఇది రెండేళ్ల కోర్సు. ఇతర కోర్సులో సీట్లు ఖాళీగా ఉన్నా, ఈ కోర్సులో మాత్రం సీట్లు నిండిపోతాయి. ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉన్న కోర్సు ఇది. కౌన్సెలింగ్‌లో తొలి ఆప్షన్‌లో ఈ కోర్సునే ఎంచుకుంటారు.

ఎలక్ట్రీకల్: ఈ కోర్సు కాల పరిమితి రెండేళ్లు. ఎలక్ట్రికల్ విభాగంతో సంబంధమున్న కోర్సు ఇది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ట్రాన్స్‌కో, జెన్‌కో, ఏపీఈపీడీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగావకాశాలు వచ్చే అవకాశముంది. అలాగే ప్రైవేటు సెక్టార్‌లో కూడా మంచి అవకాశాలు వస్తున్నాయి. ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు చాలా మంది మూడేళ్ల క్రితం కొత్తగా ఏర్పాటు చేసిన సచివాలయాల్లో ఎలక్ట్రీషియన్లుగా ఎంపికయ్యారు.

డ్రాఫ్ట్‌మెన్ సివిల్: ఈ కోర్సు కాల పరిమితి రెండేళ్లు. నిర్మాణ రంగంలో వీరికి అవకాశాలు ఎక్కువ. వివిధ ప్రభుత్వ శాఖల్లో కూడా ఉద్యోగాలు పొందే అవకాశముంది. వివిధ కార్పొరేషన్‌ల్లో డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సు పూర్తిచేసిన వారు చేరి ప్రస్తుతం ఏఈలుగా విధులు నిర్వర్తిస్తున్నారు.

మోటార్ మెకానిక్: ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. మోటార్ రంగంలో స్థిరపడేందుకు అవకాశముంటుంది. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందే వీలుంది. మోటారు రంగానికి రోజు రోజుకు ప్రాధాన్యం పెరుగుతోంది. స్వయం ఉపాధి దిశగా ఈ రంగాన్ని ఎంచుకొని అద్భుతాలు సృష్టించినవారు ఉన్నారు.

ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్: ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు. ఈ కోర్సు పూర్తయితే పరిశ్రమల్లో ఆటోమెషిన్‌ల వద్ద ఉద్యోగాలు కల్పిస్తారు. ఈ కోర్సుకు డిమాండ్ బాగానే ఉంది.

కంప్యూటర్స్: ఈ కోర్సు కాలపరిమితి ఏడాది. పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులు. ఏ రంగంలో రాణించాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాల్సిందే. కంప్యూటర్ ఆపరేటర్లుగా, హార్డ్‌వేర్‌లో ఉద్యోగాలు పొందేందుకు వీలుంది.

డీజిల్ మెకానికల్: డీజిల్‌తో సంబంధమున్న అన్ని విభాగాల్లో ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా ఆర్టీసీ గ్యారేజీల్లో ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ఈ కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే.

కటింగ్ అండ్ టైలరింగ్: ఈ కోర్సు కాల పరిమితి ఏడాది మాత్రమే. మహిళలకు సంబంధించిన కోర్సు ఇది. కటింగ్, టైలరింగ్‌కు సంబంధించి తర్ఫీదు ఇస్తారు. శ్రీకాకుళం డీఎల్‌టీసీలో ఈ కోర్సు ఉంది.

వెల్డర్: ఏడో తరగతి ఉత్తీర్ణులై పదో తరగతి చదివిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. అన్ని పరిశ్రమల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఏడాది కోర్సు ఇది. వెల్డర్ కోర్సు చదివిన వారు అరబ్ దేశాల్లో ఉద్యోగాలు పొందే వీలుంది.

ఎలక్ట్రానిక్ మెకానిక్: ఈ కోర్సు కాలపరిమితి రెండేళ్లు టీవీలు, సెల్‌ఫోన్లు రిపేర్ చేయడంలో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులో ప్రావీణ్యం పొందితే సొంతంగా తన కాళ్లపై నిలబడడటమే కాకుండా మరికొంతమందికి ఉపాధి కల్పించవచ్చు.

బ్రిడ్జి కోర్సు ద్వారా పైచదువులు

ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు బ్రిడ్జి కోర్సు ద్వారా పై చదువులు కొనసాగించవచ్చు. బ్రిడ్జి కోర్సు పూర్తిచేసిన తర్వాత ప్రవేశ పరీక్ష ద్వారా పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చు.

స్కాలర్‌షిప్ సౌకర్యం

ఐటీఐలో ప్రవేశం పొందే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం పొందే వీలుంది. రెండేళ్లు, ఏడాది కాలపరిమితిలో కూడిన ఐటీఐ కోర్సుల్లో ఉచితంగా ప్రవేశం పొందవచ్చు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారు.

కౌన్సెలింగ్ ద్వారానే..



పదో తరగతి మార్కుల ప్రాతిపదికన రూపొందించిన మెరిట్ లిస్ట్ ప్రాప్తికి నిర్దేశించిన తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లు కేటాయిస్తాం. ఐటీఐ కోర్సులు చదివిన అభ్యర్థులు తక్కువ సమయంలోనే ఉద్యోగాలు పొందే వీలుంది. ఐటీఐ చదివిన వారికి పరిశ్రమల్లో ప్రాధాన్యం ఉంటుంది. విదేశాల్లో కూడా ఐటీఐ అభ్యర్థులకు డిమాండ్ ఉంది. పరిశ్రమలకు అనుగుణంగా ఐటీఐల్లో శిక్షణ ఇస్తుండడంతో నాణ్యమైన సంస్థలు, పెద్ద పెద్ద కంపెనీలు కూడా ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించారు. శిక్షణ అనంతరం అప్రెంటీస్ మేళాలు, మెగా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం.

- ఎల్.సుధాకరరావు, జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ ఐటీఐ, ఎచ్చెర్ల

వెంకన్నకే.. శఠగోపం!

- ఆస్తులున్నా.. ఆదాయం అంతంతే
- కౌలు చెల్లించని రైతులు

(నరసన్నపేట)


వేంకటేశ్వర స్వామి దేవస్థానం

నరసన్నపేట పట్టణంలో గల వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములు పండిస్తున్న రైతులు స్వామికే శఠగోపం పెడుతున్నారు. ఆలయానికి చెందిన భూములు నరసన్నపేట మండలంలో కోమర్తి, బొరిగివలస, యారబాడు, రెల్లివలస, బసివలస, కుద్దాం, జలుమూరు మండలంలో కూర్మనాథపురం, రామకృష్ణపురం, హుస్సేన్‌పురం గ్రామాల్లో 160 ఎకరాల భూములు ఉన్నాయి. కోట్లాది రూపాయల విలువైన ఈ భూములు అన్యాక్రాంతమవుతున్నా దేవదాయశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ఆలయ భూములను కొన్నేళ్లుగా ఆయా గ్రామాలకు చెందిన రైతులే సాగు చేస్తున్నారు. అయితే 2020 సంవత్సరం నుంచి ఎకరాకు కౌలు రెండు బస్తాలు నుంచి ఎనిమిది బస్తాలకు ఆలయ కమిటీ పెంచింది. కొందరు రైతులు గత కొన్నాళ్లుగా కౌలు చెల్లించకుండా స్వామికే శఠగోపం పెడుతున్నారు. రామకృష్ణపురంలో సుమారు 123 ఎకరాలు భూమలు ఉన్నాయి. ఈ భుములపైకి వెళ్లేందుకు దేవదాయ శాఖ అధికారులు భయ భ్రాంతులు చెందుతున్నారు. కేవలం కాగితాల ఆధారంగానే కౌలు నిర్ణయించి వారి ఇస్తే తీసుకోవడం తప్ప వెళ్లి వసూళ్లు చేసే పరిస్థితి కానరావడం లేదు. ఆలయ అభివృద్ధికి అంతంత ఆదాయం ఉండటంతో పురోహితులు కుటుంబ నిర్వహణ కూడా ఇబ్బంది పడుతున్నారు. పాడుపడిన ఇంట్లోనే నివసిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా స్వామివారి దేవస్థానం భూములను సాగు చేసే రైతులు పూర్తిస్థాయిలో కౌలు చెల్లించాలని ఆలయ పురోహితులు కోరుతున్నారు. బ్రహ్మోత్సవాల సమయానికైనా అందిస్తారని స్వామివారి భక్తులు ఆశిస్తున్నారు.

నోటీసులు ఇచ్చాం

ఆలయ భూములు సాగు చేసే కౌలు రైతులకు నోటీసులు ఇచ్చాం. అయినా రైతులు కౌలు చెల్లించ లేదు. జలుమూరు మండలం రామక్రిష్ణాపురం రైతులు అసలు ఏమీ చెల్లించలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రభుత్వ ఆదేశాలిస్తే పోలీసుల సమక్షంలో దేవదాయ భూములను స్వాధీనం చేసుకుంటాం.

- టి.రవి, ఆలయ ఈవో

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల: ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఏపీ ఈఏపీ సెట్-2024 కొనసాగుతోంది. జిల్లాలో నాలుగు కేంద్రాల్లో జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. శనివారం శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 229కు 221 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 180కు 175 మంది హాజరయ్యారు. ఈ నెల 23వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

వజ్రకవచధారిగా వెంకన్న



శ్రీకాకుళం కల్చరల్: నారాయణ తిరుమలలో కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం ఆలయ అర్చకులు జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్వామి వారికి వజ్రకవచ దర్శనం నిర్వహించారు. అదేవిధంగా ఉత్సవ సంకల్పం, మంటపారాధన పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా శివబాలాజీ ఆలయం వేంకటేశ్వరస్వామికి పూజలు, అలంకరణ నిర్వహించారు. పాత శ్రీకాకుళంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామికి అలంకరణ, పూజలు నిర్వహించారు.

కూటమి విజయం ఖాయం

పొందూరు: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం ఖాయమని ఆమదాలవలస టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ అన్నారు. లోలుగు గ్రామంలో కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయంపై జగన్‌రెడ్డికి స్పష్టమైన సమాచారం ఉన్నా మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. ఓటమి తప్పదని తెలిసే వైసీపీ శ్రేణులు దాడులతో భయభ్రాంతులను సృష్టిస్తున్నారని ఆరోపించారు. రవికుమార్‌తో పాటు స్థానిక నాయకులు ఉన్నారు.

కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న రవికుమార్ →



సన్యాసమ్మ పేరంటాలకు పూజలు


పూజలో పాల్గొన్న ఎన్ఈఆర్

రణస్థలం: బంటుపల్లి పంచాయతీ పరిధి కంబాలపేటలో శనివారం సన్యాసమ్మ పేరంటాల వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. కులపెద్దలు ముంగం వారి ఆహ్వానం మేరకు ఎన్డీఏ కూటమి ఎచ్చెర్ల బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. పాడిపంటతో గ్రామాలు కలకలలాడాలని పూజలు చేశారు. కార్యక్రమంలో ముంగం నారాయణరావు, ముంగం రమణ, ముంగం లక్ష్మణరావు, ముంగం శ్రీనివాసరావు, శ్రీకాంత్, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ స్వామి కల్యాణం


స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి మార్కెట్ జంక్షన్ వద్ద కొలువుతీరిన రమా సహిత సత్యనారాయణ స్వామి శ్రీదేవి, భూదేవి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ పండా ప్రత్యేకంగా అభిషేకాలు, కుంకుమార్చన జరిపారు. అనంతరం మధ్యాహ్నం సహస్ర నామార్చనలు, హోమాలు జరిపారు. కల్యాణ వేడుకలు మహిళా భక్తులు భారీగా తరలివచ్చి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు.

108 బంగారు పూలతో..



ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయ వీధిలో కొలువుతీన కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినం వేడుకగా నిర్వహించారు. శనివారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించి పసుపు, కుంకుమలతో పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు రావి జయకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారి జన్మదిన వేడుకలు జరిపారు. బంగారంతో తయారు చేసిన 108 బంగారు పూలతో అమ్మవారికి పూజలు జరిపారు. అమ్మవారికి ప్రత్యేకంగా వివిధ పూలతో అలంకరించి పూజలు చేశారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి..


పూజల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: చినబజారులో ఉన్న వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం వైభవంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి వార్షికోత్సవం నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అలంకరణ, కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పాల్గొని అమ్మవారి పారాయణ పూజలు నిర్వహించారు. సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.


అలంకరణలో అమ్మవారు

సందడిగా సింధుపోలమ్మ సంబరాలు


ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కంచిలి: కేసరపడ గ్రామంలో సింధుపోలమ్మ అమ్మవారి సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం 6వ రోజు గ్రామంలో మేళతాలాలు, బాజా భజంత్రీలతో అధిక సంఖ్యలో గ్రామస్థులు ఊరేగింపుగా సంబరాలు జరిగాయి. ఈ నెల 13న ప్రారంభమైన సంబరాలు మే 21వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

అయ్యప్పస్వామికి పూజలు


ప్రసాద వితరణలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ఏడో వార్షికోత్సవ వేడుకలను నిర్వహణ కమిటీ ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని అత్యంత ప్రసిద్ధిగాంచిన అయ్యప్ప దేవాలయంగా ఈ ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో ప్రతి రోజూ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఆలయ ధర్మకర్తలు, సభ్యులు తమ్మినేని గీతాసాగర్, మల్లికార్జునరావు, సురేష్, కౌశిక్, రమణ, ఆలయ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడడంతో పాటు ఏటా వార్షికోత్సవం కూడా నిర్వహిస్తున్నారు. సుమారు 1500 మందికి అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.